సిఎం సహాయనిధి చెక్కుల అందజేత

ప్రజాశక్తి - రామచంద్రపురం



చెక్కులను పంపిణీ చేస్తున్న మంత్రి సుభాష్

వివిధ అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వారికి సిఎం సహాయ నిధి నుంచి రూ.22.92 లక్షల చెక్కులు మంజూర య్యాయి. ఈ చెక్కులను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ శుక్రవారం అందజేశారు. నియోజక వర్గంలోని కుందూరు, కె.గంగవరం, బట్లపాలిక, కాజులూరు, రామచంద్రపురం, తోటపేట, తోట్లపాలెం, పేరూరు తదితర గ్రామాల్లోని లబ్ధిదారులకు మంత్రి వాసంశెట్టి సుభాష్ చేతుల మీదుగా అందజేశారు.

ఆశాలకు కనీస వేతనాలేవీ..

- వయో పరిమితి పెంపు, ప్రసూతి సెలవులు నిల్
- హామీలను మరచిన కూటమి ప్రభుత్వం
- దశల వారీగా పోరాటాలకు సిద్ధం
- పట్టించుకోని ప్రభుత్వం

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

జాబ్ ఛార్ట్‌లో లేని పనులను సైతం చేస్తూ వైద్య ఆరోగ్య సేవల్లో కీలకపాత్ర వహిస్తున్న ఆశా వర్కర్లు అనేక ఏళ్లుగా సమస్యలతో సతమతం అవుతున్నారు. కనీస వేతనాలు లేక కుటుంబాలను పోషించుకునేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. నిరంతరం వీరి సేవలను వినియోగించుకుంటున్న సర్కారు సౌకర్యాలు కల్పించడంలో తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోంది. ఏ ప్రభుత్వం మారినా కొత్త సీసాలో పాత నీరు మాదిరిగా సమస్యలను పరిష్కరించడంలో మాత్రం చొరవ చూపడం లేదు. గత సర్కారు కనీస వేతనాలను అమలు చేస్తామని, ప్రసూతి సెలవులు ఇవ్వడంతో పాటు వయోపరిమితిని పెంచి అమలు చేస్తామని హామీ ఇచ్చినా అమలు చేయలేకపోయింది. ఎన్నికల్లో లబ్ధి కోసం కూటమి పార్టీలు ఆశా వర్కర్లకు సైతం పలు హామీలను ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ వాగ్దానాలను అమలు చేస్తామంటూ చెప్పుకొచ్చారు. కానీ అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీల అమలుపై చంద్రబాబు సర్కారు నేడు నోరు మెదపడం లేదు. ఈ నేపథ్యంలో ఆశా వర్కర్లు తమ న్యాయమైన కోర్కెలను సాధించుకోవడం కోసం దశలవారీగా ఆందోళనకు సిద్ధపడుతున్నారు.

కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో 3,200 మంది ఆశా కార్యకర్తలు పని చేస్తున్నారు. మాతా శిశ మరణాలను తగ్గించేందుకు కృషి, ప్రభుత్వాస్పత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా ప్రోత్సాహించడం ఇలా అనేక పనులు చేస్తున్నారు. అయితే వీరికి కనీస వేతనాలు కరువయ్యాయి. దీంతో గతంలో జరిపిన అనేక పోరాటాల నేపథ్యంలో గత జగన్ ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చింది. వర్కర్లకు మట్టి ఖర్చులుగా రూ.20 వేలు, వయో పరిమితిని 62 ఏళ్లకు పెంచుతామని, 6 నెలల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇస్తామని, పిఎం జెజెవై పథకంలో భాగంగా సర్వీసులో ఉండగా మరణిస్తే రూ.2 లక్షలు, ఏదైనా ప్రమాదం జరిగి మృతి చెందితే రూ.6 లక్షలు, పదవీ విరమణ బెనిఫిట్‌గా రూ.60 వేలు ఇస్తామని నమ్మబలికి చివరకు అధికారం కోల్పోయింది. ఇదే సమయంలో చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆశలకు గ్రాడ్యుటీ అమలు చేస్తామని, ప్రసూతి సెలవులు ఇస్తామని, వయో పరిమితి పెంచుతామని చెప్పుకొచ్చారు. వేతనాలు కూడా పెంచుతామని, ఇతర సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వీటిపై రాష్ట్ర ప్రభుత్వం 2024 ఫిబ్రవరిలో ఒప్పందం చేసుకుంది. అయినా ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకపోవడంతో మరోసారి ఆశాలు ఆందోళన చేయగా ఈ ఏడాది మళ్లీ రెండు నెలల క్రితం మరోసారి హామీ ఇచ్చింది. వీటికి మినిట్స్ కూడా నమోదు చేశారు. కానీ గత ప్రభుత్వం మాదిరిగానే ఈ సర్కారు బోడి మల్లయ్య చందాన వ్యవహరిస్తున్నట్లుగా ఆశలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నల్ల రిబ్బన్లతో నిరసనలో తెలుపుతున్న ఆశా వర్కర్లు (ఫైల్ ఫోటో)

మరోసారి ఆందోళనకు సిద్ధం

ఒప్పంద హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆశాలు మరోసారి ఆందోళనకు సిద్ధపడుతున్నారు. ఈ నెల 6న నల్ల రిబ్బన్లతో నిరసన చేస్తూ విధులకు హాజరయ్యారు. తమ డిమాండ్లను అధికారులకు విన్నవిస్తున్నారు. వివిధ డిమాండ్ల సాధనకు ఈ నెల 20 జరగనున్న దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటున్నారు. తమను కార్మికులుగా గుర్తించి కనీస వేతనాలు రూ.26 వేలు ఇవ్వాలని, లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలనే తదితర డిమాండ్లతో ఈ సమ్మె జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే అధికారులకు సమ్మె నోటీసులను అందజేశారు. దశలవారీగా ఆందోళన కార్యక్రమాలకు రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిన తరుణంలో జూన్, జూలై నెలల్లో టోకెన్ సమ్మెలో భాగంగా రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలు, పిహెచ్‌సిలు, జిల్లా కలెక్టరేట్ల వద్ద జరగనున్న సమ్మెలో పాల్గొంటారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే ఆగస్టులో నిరవధిక సమ్మెలోకి వెళ్లే ఆలోచనలో ఆశాలు అడుగులు వేస్తున్నారు.



హామీలను తక్షణం అమలు చేయాలి

గత ప్రభుత్వ విధానాలను దుమ్మెత్తి పోసిన కూటమి పెద్దలు ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికి ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలి. నీతులు చెప్పడమే కాక వాటిని పాటించే విధంగా చంద్రబాబు ప్రభుత్వం పని చేయాలి. ఇప్పటికే తీవ్ర పని ఒత్తిళ్ళ నడుమ కనీస వేతనాలు అందక, ప్రభుత్వం నుంచి సౌకర్యాలు అమలు కాక, వయోపరిమితి పెంచక అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే ప్రతిఘటన తప్పదు.

-చంద్రమళ్ల పద్మ, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి, కాకినాడ.

ఎక్సైజ్ కార్యాలయంలో వాహనాలకు వేలం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

మద్యం తరలిస్తూ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ దాడుల్లో పట్టుబడిన వాహనాలకు శుక్రవారం వేలం పాట ద్వారా రూ.1.50లక్షల ఆదాయం రాబడి వచ్చిందని ముమ్మిడివరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌ఛార్జ్ సిఐ రవితేజ తెలిపారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో కాకినాడ ప్రొహిబిషన్ అండ్ ఎక్సజ్ డిప్యూటీ కమిషనర్ కమీషనర్ వారి ఆదేశాల మేరకు అమలాపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సమక్షంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు బహిరంగ వేలం నిర్వహించారు. ఈ వేలంలో 8 వాహనాలకు వేలం నిర్వహించగా, 6 వాహనాల ద్వారా రూ.1, 27,500 రాగా, జిఎస్టి రూ.22,950 రూ. మొత్తం రూ.1,50,450 ఆదాయం సమకూరినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.



ఎస్.యానంలోని రవ్వ చమురు క్షేత్రం వద్ద మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న అధికారులు

చమురు క్షేత్రం వద్ద మాక్ డ్రిల్ నిర్వహణ

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

దేశంలో నెలకొన్న అసాధారణ పరిస్థితుల నేపథ్యంలో అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎస్.యానం రవ్వ చమురు క్షేత్రం వద్ద శుక్రవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. పోలీస్, రెవెన్యూ, మెరైన్ అధికారులతో పాటు రవ్వ చమురు క్షేత్రం యాజమాన్యమైన వేదాంత కంపెనీ అధికారులు మాక్ డ్రిల్ జరిపారు. పరిస్థితులు జటిలంగా మారిన సమయంలో సైరన్ మోగించడం జరుగుతుందని అటువంటి సందర్భాల్లో ఎవరూ బయటకు రాకుండా సురక్షిత ప్రదేశంలో ఉండాలని సూచించారు. మళ్లీ సురక్షితమైన సైరన్ మోగించే వరకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామంలో చమురు క్షేత్రం ఉన్న నేపథ్యంలో ఇక్కడ ముందస్తుగా మాక్ డ్రిల్ చేపట్టి అటు ఉద్యోగులను ఇటు గ్రామ ప్రజలను అప్రమత్తం చేశారు. మాక్ డ్రిల్‌లో అమలాపురం రూరల్ సిఐ డి.ప్రశాంత్ కుమార్, మెరైన్ సిఐ,స్థానిక ఎస్ఐ సిహెచ్.రాజేష్, వేదాంత అధికారి సతీష్ రెడ్డి, వేదాంత ఉద్యోగులు గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థి మిత్ర కిట్లను ముందస్తుగా అందించాలి

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న డాక్టర్ సర్వేపల్లి రాధాకష్ణ విద్యార్థి మిత్ర కిట్లను పాఠశాలల ప్రారంభానికి ముందే ప్రతి విద్యార్థికీ అందించాలని విద్యార్థి మిత్ర రాష్ట్ర పరిశీలకులు షేక్ అబ్దుల్ ఘని సూచించారు. శుక్రవారం ఉప్పల గుప్తం ఎంఆర్‌సి భవనంలో మండల విద్యాశాఖ అధికారులు కె.కిరణ్ బాబు, సత్తి సత్య కృష్ణ, ఉపాధ్యా యులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు ఇచ్చారు. ఒక్కో విద్యార్థికి ఇచ్చే కిట్టు రూ.2615 విలువ చేస్తుందన్నారు. కిట్టులో పాఠ్యాంశ పుస్తకాలు, బ్యాగ్, బ్యాలెట్, షూస్, సాక్సులు,ఐ నోటు పుస్తకాలు, యూనిఫామ్, డిక్షనరీ ఉంటాయన్నారు. అనంతరం విద్యార్థి మిత్ర కిట్లను భద్రపరిచిన గొల్లవిల్లి జెడ్పి ఉన్నత పాఠశాలలోని స్టాక్ రూమును అబ్దుల్ ఘని, జిల్లా సమగ్ర శిక్ష సిఎంఒ బి.సుబ్రహ్మణ్యం తో కలిసి పరిశీలించారు. కిట్లను భద్రపరిచిన గది ప్రకృతి వైపరీత్యాలకు క్రిమి కీటకాల బారిన పడకుండా పరిరక్షించాలని సూచనలు చేశారు.



గొల్లవిల్లి జడ్‌పి ఉన్నతపాఠశాల్లో కిట్లు పరిశీలిస్తున్న అబ్దుల్ ఘని, సుబ్రహ్మణ్యం

కొనసాగుతున్న అకాల వర్షాలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

అల్పపీడన ప్రభావంత కురుస్తున్న అకాల వర్షాలు శుక్రవారం కొనసాగాయి. దీంతో దాల్వా పంట అమ్మ కానికి సిద్ధం చేసుకున్న రైతులు. నాలుగు రోజులుగా అయోమయానికి గురవుతున్నారు. ప్రతిరోజు వర్షం కురవడంతో ధాన్యాన్ని ఆరబెట్టడం మళ్లీ పోగుపై పోగులు పెట్టడం నిత్య కత్యంగా మారింది. మండు వేసవిలో కురుస్తున్న అకాల వర్షాలకు రైతులు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. ఎప్పటికీ మరో 40 శాతం పంట పొలాలు వరి పంటలు కోయలేదు. ఇప్పటికే నూర్పిడి చేసిన ధాన్యం పంట పొలాలలోనూ మెయిన్ రోడ్ లో వెంబడి అమ్మకానికి ఎదురుచూస్తుంది. ఈ నేపథ్యంలో ప్రతిరోజు ధాన్యం తడిచిపోవడంతో దాన్ని ఆరబెట్టడంతో రైతన్నలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. మరో వారం రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు ప్రకటన చేయడంతో దాల్వా రైతులు మరింత ఆందోళన గురవుతున్నారు. చేతికి వచ్చిన పంట అమ్ముకుని సొమ్ము చేసుకునే అవకాశం ఉంటుందో లేదో అని రైతులు ఆందోళన చెందుతున్నారు. నాలుగు రోజుల నుంచి ప్రతీ రోజు వర్షం కురవడంతో రైతులు మరింత కలవరపాటు గురవుతున్నారు. మరోవైపు కొనుగోళ్లు నత్తనడకగా సాగడంతో ఎక్కడ ధాన్యం అక్కడే ఉందని కొనుగోళ్ల మరింత వేగవంతం చేయాలని రైతులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇదే అదనుగా దళారులు మాత్రం తక్కువ ధరకే ధాన్యం కొనుగోలు కొనసాగిస్తున్నారు.



ద్రాక్షారామం మెయిన్ రోడ్డులో కురుస్తున్న భారీ వర్షం



కళ్లాల్లో తడిసిన ధాన్యం పోగులు వేరు చేస్తున్న రైతులు

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - మండపేట

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యముగా కూటమి ప్రభుత్వం పరిపాలన సాగిస్తుందని రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, మండపేట ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. మండపేట తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ వేగుళ్ళ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఆదేశాల మేరకు ప్రతీ శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో వచ్చిన ప్రతీ అర్జీని పరిశీలించి సంబంధిత శాఖ అధికారులతో సమన్వయం చేసి వాటి పై చర్యలు తీసుకుని సమస్య పరిష్కరిస్తామని ఎంఎల్ఎ వేగుళ్ళ తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజలు, పాల్గొన్నారు.



మండపేటలో ప్రజల సమస్యలపై దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంఎల్ఎ జోగేశ్వరరావు

గ్రామాభివృద్ధిలో సర్పంచ్ సుభాష్ కృషి ప్రశంసనీయం

ప్రజాశక్తి - ఆలమూరు

పినపళ్ల గ్రామ పంచాయతీని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేయడంతో పాటు రాష్ట్ర ఉత్తమ పంచాయతీ అవార్డు సాధనలో సర్పంచ్ సంగిత సుభాష్ కృషి ప్రశంసనీయం కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు, జనసేన నియోజక వర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రీనివాసరావు, ఒఎన్‌జిసి ఇడి సంతాన దాస్ అన్నారు. మండలంలోని పినపళ్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఒఎన్‌జిసి సహకారంతో శుక్రవారం చేపట్టిన పలు అభివృద్ధి పనులను వారు ప్రారంభోత్సవం చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి సర్పంచ్ సుభాష్ అధ్యక్షతన వహించగా ఎంఎల్ఎ బండారు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఉమ్మడి జిల్లా చరిత్రలో మును పెన్నడూ లేని విధంగా రాష్ట్ర స్థాయిలో పేదరిక నిర్మూలన, అందరికీ ఉపాధి కల్పన అనే అంశాలపై అవార్డు సాధించడం గర్వకారణ మన్నారు. ఈ గ్రామ ప్రతిష్టను జాతీయ స్థాయికి తీసుకువెళ్లిన ఘనత సర్పంచ్ సుభాష్‌కే దక్కుతుందన్నారు. గ్రామాన్ని సుమారు రూ.1.98 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేయడమే కాకుండా పారిశ్రామిక ప్రగతిని ప్రోత్సహించి అనేక మందికి ఉపాధి సౌకర్యాలు కల్పించడం, పారిశుధ్యం చర్యలు చేపట్టడం అభినందనీయ మన్నారు. అనంతరం గ్రామ మౌలిక సదుపాయాల కల్పన గురించి ఎంఎల్ఎ బండారు అడిగి తెలుసుకుని నిధుల మంజూరుకు తమ వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈసందర్భంగా ఒఎన్‌జిసి సహకారంతో సుమారు రూ.10 లక్షల చొప్పున వ్యయంతో పినపల్ల, పెదపళ్ళ గ్రామాల్లో చెత్త తరలించేందుకు పంచాయతీల కోసం కొనుగోలు చేసిన రెండు ట్రాక్టర్లు అండ్ ట్రాలీలను ఎంఎల్ఎ సత్యానందరావు బండారు ప్రారంభించారు.



సర్పంచ్ సుభాష్‌ను సత్కరిస్తున్న ఎంఎల్ఎ సత్యానందరావు, తదితరులు

సర్పంచ్ సుభాష్ కు ఘన సత్కారం

రాష్ట్ర స్థాయి ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డు సాధించిన సర్పంచ్ సుభాష్‌ను ఎంఎల్ఎ సత్యానందరావు, జనసేన నేత శ్రీనివాస్, ఒఎన్‌జిసి ఇడి సంతాను దాస్ ఆధ్వర్యంలో గ్రామస్తుల సమక్షంలో మెమెంటో బహూకరించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

గర్భిణులు ప్రతినిత్యం పౌష్టికాహారం తీసుకుని వైద్య సలహాలు పాటించడం ద్వారా పుట్టబోయే బిడ్డ తల్లి ఆరోగ్యవంతంగా ఉంటారని అంగర పిహెచ్‌సి వైద్యాధికారిణి డాక్టర్ పి.రత్నకుమారి అన్నారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కపిలేశ్వరపురం మండలంలోని అంగర, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు నిర్వహించిన ప్రత్యేక వైద్య పరీక్షల్లో వైద్యాధికారిణి రత్నకుమారి 19 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి వారికి మందులను అందజేశారు. అనంతరం గర్భిణులు తీసుకోవలసిన జాగ్రత్తలు, పౌష్టికాహారం, ప్రధానమంత్రి వందన యోజన పథకం, ఆసుపత్రిలో ప్రసవాల ప్రాముఖ్యత, ఆరోగ్య ఆసరా, ప్రభుత్వం ద్వారా కలిగే ప్రయోజనాలను డాక్టర్ రత్నకుమారి, ఎంపిహెచ్ఇఒ జె.మల్లికార్జునుడు, హెల్త్ ఎడ్యుకేటర్ బి.రామారావు వివరించారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ మల్లికార్జునుడు, హెచ్ఇ బి.రామారావు, హెల్త్ విజిటర్ టి.మేరీమణి, ఎఎన్ఎంలు, వైద్య సిబ్బంది, అంగనవాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, పాల్గొన్నారు.



అంగర పిహెచ్‌సిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ రత్నకుమారి

ఆపరేషన్ సింధూర్‌కు సంఘీభావ ర్యాలీ

ప్రజాశక్తి - రామచంద్రపురం

భారత సైన్యం పాకిస్థాన్‌పై సాగిస్తున్న యుద్ధం ఆపరేషన్ సింధూర్ కు మద్దతుగా సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. మండలం లోని హసన్ బాద గ్రామంలో సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం ఈ ర్యాలీ ఏర్పాటు చేశారు. భారత సైన్యానికి సంఘీభావం తెలియజేస్తూ ఆపరేషన్ సిందూర్‌కు సెల్యూట్ చేస్తూ, జయహో భారత్, పాకిస్తాన్ ఉగ్రవాదులు నశించాలని నినాదాలు చేస్తూ గ్రామ వీధులలో ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కాశ్మీర్ పహల్గామాలో పాకిస్తాన్ ఉగ్రవాదుల చేసిన దాడులకు ప్రతీకారంగా మహిళా ఆర్మీ నాయకత్వంలో చేసిన ఆపరేషన్ సింధూర్ విజయవంత మైందన్నారు. పాకిస్తాన్ ఉగ్రవాదుల శిబిరాలను ధ్వం సం చేసిన మహిళా ఆర్మీ నాయకత్వాన్నీ అభినందించారు. ఈ కార్యక్రమంలో విఆర్ఒ నరహరశెట్టి సత్తిబాబు, సచివాలయ సిబ్బంది, డ్వాక్రా, రెవెన్యూ సిబ్బంది, ఉపాధి హామీ కార్మికులు, గ్రామ ప్రజలు, యువకులు పాల్గొన్నారు.



హసన్‌బాదలో సంఘీభావ ర్యాలీలో పాల్గొన్న అధికారులు, సర్పంచ్ తదితరులు

కార్టూ'నిజం'





ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో లయన్ జివి.రావు

మోడరన్‌లో పాలిసెట్ అవార్డుల ప్రదానం

ప్రజాశక్తి - రామచంద్రపురం

పట్టణంలో గత నెల ఏప్రిల్ 28న మోడరన్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన మోడల్ పాలిసెట్ కి విశేష స్పందన లభించింది .ఈ నేపథ్యంలో మోడరన్ పాలిసెట్ లో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు శుక్రవారం మోడరన్ విద్యాసంస్థల ఆవరణలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులకు మునిసిపల్ ఛైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, శ్రీధర్ నగదు పురస్కారం, షీల్డ్, అందజేశారు.ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ గత 47 విద్యా సంవత్సరాలుగా మోడరన్ అధినేత డాక్టర్ లయన్ జివి.రావు గ్రామీణ ప్రాంత విద్యార్థులను విజేతలుగా తీర్చిదిద్దుతూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారని కొనియాడారు. మోడరన్ అధినేత జివి.రావు మాట్లాడుతూ అకాడమిక్ స్టడీస్ తో పాటు విద్యార్థులకు పోటీ పరీక్షల పట్ల అవగాహన కలిగించేలా మోడరన్ కాంపిటేటివ్ సెల్ నిర్వహిస్తున్నమన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యా స్కూల్ కరెస్పాండంట్ డి.సత్తిబాబు, మోడరన్ స్టాఫ్, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

వాహనాల విస్తృత తనిఖీ

ప్రజాశక్తి - మండపేట

మండపేట మండలం జెడ్.మేడపాడు వంతెన సమీపంలో గురువారం రాత్రి మండపేట రూరల్ సిఐ దొరరాజు ఆధ్వర్యంలో వాహనాలు విస్తృత తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ దొరరాజు మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్.బుచ్చిబాబు, తన సిబ్బందితో కలిసి స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వాహనాలను తనిఖీ చేశామన్నారు. అనుమానిత వ్యక్తులు, అనుమానిత వాహనాలు, అనుమానిత పదార్థాలపై తనిఖీలు చేశామన్నారు. ఐదుగురు వ్యక్తుల పై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. అలాగే అంగర, రాయవరం స్టేషన్ ల పరిధిలో పలు కేసులను నమోదు చేసినట్లు సిఐ దొరరాజు తెలిపారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న మండపేట రూరల్ సిఐ దొరరాజు. సిబ్బంది

నేరాలు ఘోరాలు

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కరప

ఒక వ్యక్తి గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందారు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ టి.సునీత తెలిపిన వివరాలు ప్రకారం... గొర్రిపూడి గ్రామానికి చెందిన యర్రంనీడి సత్య నూకరాజు (69) మతిస్థిమితం సరిగా ఉండదు. ఈ నెల గురువారం రాత్రి 7 గంటలకు బయటికి వెళ్లి తిరిగి రాలేదు. శుక్రవారం ఉదయం 6 గంటలకు రోడ్డు ప్రక్కన నూకరాజు తలకు తీవ్ర గాయాలై పడి ఉండడాన్ని గ్రామానికి చెందిన ఒంటె వీరబాబు గమనించారు. మృతుని కుటుంబీకులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. తన తండ్రిని ఏదో గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టి వెళ్లిపోయిందని మృతుని కుమారుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో వెండి, బంగారం వస్తువుల చోరీ

ప్రజాశక్తి - ముమ్మిడివరం

తాళం వేసిన ఇంట్లో వెండి, బంగారం వస్తువులు చోరీ అయ్యాయి. ఈ ఘటన మండలంలోని అన్నంపల్లి పంచాయతీ పరిధిలోని లక్ష్మీదేవిలంకలో చోటు చేసుకుంది. శుక్రవారం దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని లక్ష్మీదేవిలంకకు చెందిన కడలి పద్మావతి బుధవారం సామర్లకోట బంధువుల ఇంటికి వెళ్లింది. అయితే శుక్రవారం పద్మావతి ఇంటి దగ్గర పెట్టిన బండిని తీసుకోవడానికి ఆమె మనవడు హేమరాజు వెళ్లాడు. అయితే ఇంటి తాళాలు తెరిచి ఉండడంతో ఆ విషయాన్ని పద్మావతికి చెప్పాడు. అతను ఇంటి వెనకవైపు చూడగా తలుపులు తాళాలు తెరిచి ఉండడాన్ని చూసి విషయాన్ని పద్మావతికి తెలిపాడు. దీంతో పద్మావతి వచ్చి చూడగా బీరువా తాళాలు తెరిచి ఉన్నాయి. బీరువాలో 55 గ్రాముల బంగారం, 39 తులాలు వెండి రూ.20వేల నగదు అపహరించినట్లు గుర్తించారు. దీంతో విషయాన్ని పోలీసు ఫిర్యాదు చేయగా సిఐ ఎం. మోహన్ కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ జ్వాల సాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. క్లూస్ టీమ్ ఆధారాలు సేకరిస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థుల నమోదు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - సామర్లకోట

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించే నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఎంఇఒ వై.శివరామకృష్ణయ్య సూచించారు. శుక్రవారం మండలంలోని వేట్లపాలెం, మాధవపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలు, స్థానిక ఎస్‌టిజికె ఉన్నత పాఠశాల, సామర్లకోట క్లస్టర్ పాఠశాల హెచ్ఎంలు, ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల హెచ్ఎంలతో అత్యవసర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాల హెచ్ఎం ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసుకుని, ప్రతిరోజు ఎన్రోల్మెంట్ డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. ఏరోజు కారోజు పాఠశాలలో చేరిన విద్యార్థుల వివరాలను క్లస్టర్ పాఠశాలల హెచ్ఎంలకు తెలియచేయాలన్నారు. అంగన్‌వాడీ పరిధిలోని 5 ప్లస్ వయసు నిండిన విద్యార్థులను పాఠశాలలో వెంటనే చేర్చుకుని ఆ వివరాలను హెచ్ఎంలకు తెలియచేయాలని అన్నారు. ఈ సమావేశంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు అనురాధ, గోవింద రాజులు, ఎల్.ప్రసున్న, తాంత్ర శ్యామ్ సుందర్ పాల్గొన్నారు.

12వ పిఆర్‌సి కమిటీని నియమించాలి

ప్రజాశక్తి - కాకినాడ

12వ పిఆర్‌సి కమిటీని వెంటనే నియమించాలని, ఐఆర్ ప్రకటించాలని, విద్యాశాఖలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఎపిటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ వద్ద సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.ఫిలిప్‌రాజు, ఎన్.శ్రీనివాస్ మాట్లాడారు. ఒకటి నుంచి 5వ తరగతులను మోడల్ లేక బేసిక్ ప్రాథమిక పాఠశాలలుగానే కొనసాగించాలన్నారు. ప్రతి ప్రాథమిక పాఠశాలలకి సంఖ్యతో సంబంధం లేకుండా కనీసం రెండు ఎస్‌జిటి పోస్టులు ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డిఆర్‌ఒకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు గోరస దుర్గాప్రసాద్, నాయకులు వి.శ్రీరామ్, కెఎస్.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

రక్షణగోడ నిర్మాణ ప్రాంతాల పరిశీలన

ప్రజాశక్తి - యానాం

గోదావరి వరదలకు యానాం పట్టణంతో పాటు నియోజకవర్గ పరిధిలో పలు ప్రాంతాలను ముంపునుంచి రక్షించేందుకు అవసరమైన రక్షణగోడ నిర్మాణ ప్రాంతాలను శుక్రవారం కేంద్రప్రభుత్వ అధికారుల బృందం పర్యటించింది. ఈ సందర్భంగా కనకాలపేట నుంచి నియోజకవర్గ శివారు తీరప్రాంత గ్రామం సావిత్రినగర్ వరకు రక్షణగోడ నిర్మాణానికి గతంలో పుదుచ్చేరి ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. దీంతో కేంద్ర ఉన్నతాధికారి ప్రభాస్ చంద్ర నేతృత్వంలో నిపుణుల బృందం గోదావరిలో ప్రత్యేకబోటులో పరిశీలించింది. ఈ సందర్భంగా ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, పిడబ్ల్యూడి అధికారులు రక్షణగోడ ఆవశ్యకత, ప్రయోజనాలు, ఇతర విషయాలను కేంద్ర బృందానికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎఒ మునిస్వామి, రెవెన్యూ, పిడబ్ల్యూడి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

3వ రోజుకు ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - పెద్దాపురం

తమ సమస్యలు పరిష్కారం కోరుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం మూడవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహి స్తున్న సమ్మె శిబిరంలో ఇంజనీరింగ్ కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ అనేక సంవత్సరాలుగా తాము విధులు నిర్వహిస్తున్నా తమకు వేతనాలు పెంచడం లేద న్నారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.నాగేశ్వరరావు, కె.వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల పురోగతిపై సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్

ప్రజాశక్తి - అమలాపురం

స్థానిక కలెక్టరేట్ నందు జిల్లా స్థాయిలో గృహ నిర్మాణాల పురోగతిపై గృహ నిర్మాణ సంస్థ ఇంజినీర్లతో కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికీ ఇండ్లు అనే ప్రభుత్వ దార్శనికతకు అనుగుణంగా నిరుపేద కలల సౌధం సొంత ఇంటి కలను సాకారం చేస్తూ ప్రభుత్వ లక్ష్యాలను చేరుకోవాలని గృహ నిర్మాణ సంస్థ ఇంజనీర్లను ఆదేశించారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా చేపట్టిన గహాలలో 61 శాతం మాత్రమే పురోగతి సాధించ వారని మరో రెండు వారాలలో నిర్మాణం తుది దశకు చేరుకుని లింటల్ రూఫ్ స్థాయిలో ఉన్న గృహాలను పూర్తి చేసి 80 శాతం పురోగతి సాధించాలని ఆదేశించారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, అర్బన్ ద్వారా అందరికీ గృహ నిర్మాణాలను అమలు చేస్తున్నదని తద్వారా పట్టణ ప్రాంతాల మురికి వాడల నివాసి తులు, దారిద్య రేఖకు దిగువన ఉన్న ఆర్థికంగా వెనుక బడిన పేదలకు గూడును ఏర్పాటు చేయడంలో ఇంజనీర్లు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. లబ్దిదారులను చైతన్య పరుస్తూ మధ్యలో నిలిచి పోయిన గహాలను ప్రభుత్వం ప్రకటించిన అదనపు సాయంతో పూర్తిచేసే లక్ష్యాలు చేరుకోవాలని ఆదేశించారు. వ్యక్తిగత గృహ నిర్మాణాలకు వేగవంతం చేస్తూ నిరుపేదలకు సొంత గూడును సమకూర్చాలన్నారు. పేదరిక నిర్మూలన సాధనంగా ప్రభుత్వం దృష్టి సారించిన ప్రధాన అంశంగా గృహ నిర్మాణం ఉందన్నారు. గ్రామీణ గృహనిర్మాణ కార్యక్రమంలో ఈ అంతరాలను పరిష్కరించడానికి అందరికీ గృహనిర్మాణం కల్పించాలనే ప్రభుత్వ నిబద్ధతను దృష్టిలో ఉంచుకుని, కచ్చా, శిథిలావస్థలో నివసిస్తున్న కుటుంబాలకు ప్రాథమిక సౌకర్యాలతో కూడిన పక్కా ఇంటి ని గ్రామీణ ద్వారా అందించడం జరుగుతోందన్నారు. మన ఇల్లు మన గౌరవం (అందరికీ గృహ నిర్మాణం) పథకం నిరుపేదలకు సబ్సిడీ తో గృహాలను అందించడానికి ప్రతి పౌరుడికి సరైన ఇల్లు అందు బాటులో ఉండేలా చూసుకోవడం, నిర్మాణ యూనిట్ల తగ్గించ "దానికి ఉద్దేశించ బడిందన్నారు. ఇంజినీర్లు పనితీరు మెరుగు పరుచుకుని ఆశించిన పురోగతిని సాధించాలన్నారు. సిబ్బంది కొరత ఉంటే సచివాలయ ఇంజనీర్లను నియమించు కోవచ్చునని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని ఆ మేరకు ఇంజనీర్లను నియమిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేద, ఆర్థికంగా బలహీన వర్గాల వారికి తక్కువ ధరలో గృహాలను అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది న్నారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ సంస్థ పిడి ఎం.వి.నరసింహారావు, ఇఇలు డిఇలు, ఎఇలు పాల్గొన్నారు.

భూమి మార్కెట్ విలువలపై ప్రతిపాదనలు సిద్ధంచేయాలి

భూమి మార్కెట్ విలువలకు సంబంధించిన మరింత లోతైన విశ్లేషణ నిర్దిష్టమైన సిఫార్సులతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ రామచంద్రపురం ఆర్డీఓ డి.అఖిలను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నందు రామచంద్ర పురం పట్టణంలో భూముల మార్కెట్ తదనంతరం భూముల విలువలు నిర్ధారణ అంశాల పట్ల ఉత్పన్నమైన అభ్యంతరాలపై జోనల్ ఉమ్మడి, జిల్లా రిజిస్ట్రార్, ఆర్డీఓతోకలెక్టర్ అధ్యక్షతన సమీక్షించారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ భూముల మార్కెట్ తదనంతర వాణిజ్య నివాస భూములుగా నిర్ధారిస్తూ ప్రస్తుత మార్కెట్ విలువలను అంచనా వేయడానికి, వాటిని ప్రభావితం చేసే అంశాలను గుర్తించడానికి అవసరమైతే విలువలను సవరించడానికి సంబంధించి వాస్తవాలతో తగిన సిఫార్సులు కొరకు ప్రతి పాదనలు సిద్ధం చేయాలన్నారు. వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా భూముల యొక్క వివిధ వర్గాలైన వ్యవసాయ భూమి, వర్తక భూమి, ప్రాథమిక ప్రాంతం, గనులు, తోటలు, వాణిజ్య వ్యవసాయేతర భూములు కోసం మార్కెట్ విలువలను రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు నిర్ణయిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ డి.అఖిల, డిప్యూటీ ఇన్స్పెక్టర్ జనరల్ రిజిస్ట్రేషన్ విభాగం జోనల్ అధికారిని ఎం మాధవి జిల్లా రిజిస్ట్రార్, మార్కెట్ విలువల ఆడిట్ అధికారి జెయుఎస్.జయలక్ష్మి, రామచంద్రపురం ఇన్‌ఛార్జ్ మున్సిపల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న వైద్యసిబ్బంది, వాకర్స్ హెల్త్ క్లబ్

వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత లివర్ పరీక్షలు

ప్రజాశక్తి - అమలాపురం

అమలాపురం వాకర్స్ హెల్త్ క్లబ్ సభ్యుల పోత్సాహంతో మెడ్ యునైటెడ్ హాస్పటల్లో శుక్రవారం ఉచిత లివర్ పరీక్షలు నిర్వహించారు.లివర్ కు సంబంధించిన వివిధ పరీక్షలు నిర్వహించారు. రూ.5 వేల విలువచేసే పరీక్షలు ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కెపిఆర్ కిషోర్ గ్యాస్ట్రో ఎంట్రాలజీస్ట్ ముఖ్యఅతిథిగా పాల్గొని రోగులను పరీక్షించారు. ఈ కార్యక్రమానికి క్లబ్ అధ్యక్షులు బోనం సత్య వర ప్రసాద్, సెక్రెటరీ బూరగాయల శివరామకృష్ణ, ఉపాధ్యక్షులు నూకల సత్యనారాయణ, డైరెక్టర్ మోకా వెంకటసుబ్బారావు, వలవల రెడ్డీ నాయుడు, పుత్సా కామేశ్వరరావు, పట్నాల రమణ, యర్రమల్లి సత్యనారాయణమూర్తి, కుడిపూడి త్రినాథ్, తదితరులు పాల్గొన్నారు.

కొమరగిరిపట్నం గ్రామదేవత ఆలయం తొలగింపుపై వివాదం

ప్రజాశక్తి - అల్లవరం,

కొమరగిరిపట్నం గ్రామదేవత మహాలక్ష్మి అమ్మవారి ఆలయాన్ని కొందరు ఏకపక్షంగా కూల్చివేశారని ఆ గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై తక్షణ చర్యలు చేపట్టి దీనికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులకు కొందరు గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం అల్లవరం తహాశీల్దార్ బివిఎల్. నరసింహారావు, ఎస్ఐ తిరుమలరావు ఫిర్యాదు చేసిన వారితో కొమరగిరి పట్నంలో సమావేశం నిర్వహించి చర్చించారు. ఈసందర్భంగా ఆలయ నేపథ్యంతో పాటు తమ డిమాండ్లను అధికారులకు ఏకరువుపెట్టారు. గ్రామదేవతగా కొలువబడుతున్న అమ్మవారి ఆలయం కూల్చివేత విషయాన్ని అందరికీ తెలపాల్సి ఉన్నా ఏకపక్షంగా దౌర్జన్యంగా కూలగొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. గ్రామంలో గతంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగేలా తలెత్తిన పలు అంశాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై అధికారులు ఉన్నతాధికారుల దష్టికి తీసుకువెళ్లి పరిష్కారదిశగా ప్రయత్నిస్తామని అంతవరకు గ్రామంలో ఎటువంటి ఉద్రిక్తతలకు తావివ్వొద్దని తహాశీల్దార్, ఎస్ఐలు సూచించారు. ఈ సమావేశంలో భైరిశెట్టి రామారావు, ఎంపిటిసి సభ్యుడు పెచ్చేట్టి వెంకటేశ్వరరావు, కడలి శ్రీనివాసరావు, పితాని సత్యనారాయణ, బొంతు సత్యనారాయణ, గెద్దాడ జాన్‌తాతారావు, పితాని శేషారావు, కొనుకు బాబూరావు తదితరులు పాల్గొన్నారు.



జొన్నాడ సెంటర్లో డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్నపోలీసులు

రహదారి నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - ఆలమూరు

రహదారులపై ప్రయాణించే వాహన దారులు నిబంధనలు తప్పక పాటించాలని సిఐ సిహెచ్.విద్యాసాగర్ అన్నారు. జిల్లా ఎస్‌పి ఉత్తర్వులు ప్రకారం మండలంలోని వివిధ రహదారి కూడళ్లలో స్థానిక ఎస్ఐ ఎం.అశోక్, పోలీస్ సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు శుక్రవారం నిర్వహించారు. ఇందులో భాగంగా జొన్నాడ సెంటర్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో సరైన రికార్డులు లేని 10 వాహనాలకు సుమారు రూ.10 వేల జరిమానా ఫైన్ విధించారు. అదేవిధంగా మద్యం తాగి వాహనాలను నడుపుతున్న ఆరుగురుని అదుపులోకి తీసుకున్నారు. ఇందులో నాలుగు మోటార్ సైకిళ్లు, ఒక లారీ, ఒక ఆటోను సీజ్ చేశారు. అలాగే అదుపులోకి తీసుకున్న వారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు సిఐ విద్యాసాగర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ వాహన ప్రయాణంలో మద్యం తాగి నడపరాదన్నారు. ఇది రహదారి నిబంధనలకు పూర్తిగా విరుద్ధమని అన్నారు. నిబంధనలు అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎఎస్ఐ సూర్య చంద్రరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఊబలంకలో మలేరియా పాజిటివ్ కేసు నమోదు

అప్రమత్తమైన వైద్యాధికారులు

ప్రజాశక్తి - రావులపాలెం

మండలంలో ఊబలంకలో ఒక వ్యక్తికి మలేరియా పాజిటివ్ నమోదు కావడం కలకలం రేపింది. గ్రామానికి చెందిన ఒక వ్యక్తి తరచూ జార్కండ్ రాష్ట్ర వెళ్లి వస్తూ ఉంటాడు. కాగా ఇటీవల అనారోగ్యానికి గురి కావడంతో ఊబలంక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చాడు. రక్త పరీక్ష చేయడంతో మలేరియా పాజిటివ్ గా నిర్ధారణ అయ్యింది. దీంతో స్థానిక వైద్య సిబ్బంది జిల్లా మలేరియా అధికారి ఎన్.వెంకటేశ్వరరావుకు సమాచారం అందించారు. దీంతో ఆయన గురువారం ఊబలంక పి.హెచ్.సి ల్యాబ్, ఊబలంక గ్రామాన్ని సందర్శించారు. ఆ వ్యక్తికి చికిత్స అందిస్తున్న సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు చేశారు. అలాగే మూడు బృందాలుగా సిబ్బందిని ఏర్పాటు చేసి గ్రామంలో సర్వే నిర్వహించారు. జ్వర పీడితుల రక్త నమూనాలను సేకరించి పరీక్షలకు పంపించారు. అలాగే గ్రామస్తులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. గ్రామ పంచాయతీ సిబ్బంది ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టారు. ఎక్కడా నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారిణి డాక్టర్ ఎస్‌కె.హసీనా, ఎస్‌యుఒ సిహెచ్.వెంకటేశ్వరరావు, హెల్త్ సూపర్‌వైజర్లు ఆర్.శామ్యూల్‌రాజు, వి.లక్ష్మణరావు. ల్యాబ్ టెక్నీషియన్లు జివివిఎస్.నారాయణ, ఎస్.కె.ఇర్ఫాన్, ఎ.ఎన్.ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



ఊబలంక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మలేరియా కేసును నిర్ధారించిన వైద్యులు

సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్

ప్రజాశక్తి - రావులపాలెం

ప్రజా సమస్యలు పరిష్కరించడానికే ప్రభుత్వం ప్రజాదర్బార్ నిర్వహిస్తోందని ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. శుక్రవారం స్థానిక ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఎంఎల్ఎ సత్యానందరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను ఎంఎల్ఎ స్వీకరించారు. ప్రజాదర్బార్ కార్యక్రమంలో 230 అర్జీలు ప్రజల వద్ద నుంచి స్వీకరించామని ఎంఎల్ఎ అన్నారు. ప్రజా వినతులు, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకునే విధంగా సంబంధిత శాఖల అధికారులకు అర్జీలను అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. స్థానిక మహిళ సమస్య ను ఎంఎల్ఎ దృష్టికి తీసుకురాగా హుటాహుటిన పంచా యతీ కార్యదర్శిని పిలిపించి తక్షణమే సమస్యను పరిష్కరి ంచాలని ఆదేశించారు. ప్రజాదర్బార్‌లో ప్రజలు ఇచ్చిన అర్జీ లకు పరిష్కారం చూపుతామని ఎంఎల్ఎ తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, అర్జీదారులు పాల్గొన్నారు.



రావులపాలెంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఎంఎల్ఎ సత్యానందరావు

పిహెచ్‌సిల్లో ఓఎన్‌జిసి అభివృద్ధి పనులు అభినందనీయం

ఆలమూరు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోగుల సౌకర్యార్థం ఓఎన్‌జిసి చేపట్టిన అభివృద్ధి పనులు అభినందనీయమని కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు కొనియాడారు. మండలంలోని పెదపళ్ల పిహెచ్‌సిలో అవుట్ పేషంట్ విభాగం వద్ద వెయిటింగ్ షెడ్డును జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రీనివాసరావు, ఓఎన్‌జిసి ఇడి సంతాన దాస్‌లతో కలిసి శుక్రవారం ఆయన ప్రారంభించి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. స్థానిక నాయకుల పలు విజ్ఞప్తుల మేరకు స్పందించి ఓఎన్‌జిసి నిధుల నుంచి రూ.10 లక్షల మంజూరు చేయగా, దీనికి మండల పరిషత్ నిధుల నుంచి రూ.2 లక్షల మ్యాచింగ్ గ్రాంట్ కలిపి రూ.12 లక్షలతో ఈ షెడ్డు నిర్మాణం పూర్తి చేసినట్టు ఎంఎల్ఎ తెలిపారు. ఈ షెడ్డు నిర్మాణం వల్ల రోజు వారి రోగులకు ఇబ్బందులు తొలగనున్నాయని ఎంఎల్ఎ వ్యాఖ్యానించారు. పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..

చట్టాలపై కిశోర బాలికలకు అవగాహన

ప్రజాశక్తి - అంబాజీపేట

లైంగిక విద్య, బాలల హక్కులు, రక్షణ, పోక్సో చట్టం, లింగ వివక్ష, అసమానతలు, సైబర్ నేరాలు, ఆన్ లైన్ భద్రత తదితర చట్టాలపై కిశోర బాలికలు అవగాహన పెంచుకోవాలని అంగన్‌వాడీ పర్యవేక్షకురాలు వాసర్ల వెంకట మహాలక్ష్మి తెలిపారు. మాచవరం పంచాయతీ పరిధిలో మెట్ల కాలనీ అంగన్ వాడి కేంద్రంలో కిశోర వికాసం వేసవి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కౌమార దశలు బాలికలు తమ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని రక్తహీనత బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బాల్యవివాహాలు పట్ల కలిగే ఇబ్బందులను వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ కె.కనకదుర్గ, అంగన్‌వాడీ కార్యకర్తలు గంటా దుర్గాదేవి, గుబ్బల వెంకటలక్ష్మి, జి.కృష్ణవేణి, నాగాబత్తుల విజయ కుమారి, కత్తుల రత్నకుమారి, హెల్పర్ కోమని నాగలక్ష్మి, ఆశా వర్కర్ ఎం.అనంత కుమారి, తదితరులు పాల్గొన్నారు.



బాలికలకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీలు

పార్టీ కోసం కష్టపడే వారికే పదవులు

ప్రజాశక్తి - మండపేట

టిడిపి కోసం అహర్నిశలు కష్టపడుతున్న వారికే కమిటీలలో పదవులకు ఎంపిక చేయాలని రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండపేట టిడిపి కార్యాలయంలో మండల కమిటీలు, మండల అనుబంధ కమిటీల నియామకం పై మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాల టిడిపి నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. పార్టీ కార్యకర్తలతో ముఖాముఖి నిర్వహించి, వారి సమస్యలను అడిగితెలుసుకున్నారు. నేరుగా తెలియజేయాలన్నారు. కార్యకర్తల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండపేట నియోజకవర్గంలో 95 శాతం కుటుంబ సాధికారసారథలను నియమించడంటం జరిగిందన్నారు. అదే విధంగా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు అన్ని కమిటీలను ఈనెల 18వ తేదీ లోపు 100 శాతం ఏర్పాటు చేయాలని, అందుకు ప్రతీ ఒక్కరూ కషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, మాజీ డిసిఎంఎస్ ఛైర్మన్ రెడ్డి ప్రసాద్, రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి రిమ్మలపూడి వేణుగోపాల దొర, కపిలేశ్వరపురం మండల అధ్యక్షులు ముత్యాల వెంకట్రావు, మండపేట మండల అధ్యక్షులు యరగతపు బాబ్జి, అమలాపురం పార్లమెంట్ అధికార ప్రతినిధి పుత్సల శ్రీను, తదితరులు, పాల్గొన్నారు

జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా సత్యరాణి

ప్రజాశక్తి - మండపేట

రాయవరం మండలం, పసలపూడి గ్రామానికి చెందిన ఏడిద సత్యరాణి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం మండపేట టిడిపి కార్యాలయంలో రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, మండపేట ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావును ఆమె కుటుంబ సభ్యులతో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సంధర్భంగా ఎంఎల్ఎ వేగుళ్ళ ఆమెను అభినందించారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యుడు కర్రి కృష్ణారెడ్డి, రామచంద్రపురం డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షులు నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి, అనసూరి శ్రీను, నల్లమిల్లి సతీష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

13న డిఎస్‌సిపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - కాకినాడ

ఈ నెల 13న ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) జిల్లా శాఖ ఆధ్వర్యంలో డిఎస్‌సి అవగాహన సదస్సు నిర్వహి స్తున్నట్లు యుటిఎఫ్ నాయకత్వం వెల్లడించింది. శుక్రవారం స్థానిక యుటిఎఫ్ హోంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి టి.రవి చక్రవర్తి, పూర్వ రాష్ట్ర కార్యదర్శి జి.ప్రభాకరవర్మ విలేకరుల సమావేశంలో మాట్లా డారు. అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ లక్ష్యాలను నిర్దేశించుకున్న యుటిఎఫ్ ఉపాధ్యాయుల శ్రేయస్సు, ప్రభుత్వ విద్యా రంగం పరిరక్షణ కోసం కృషి చేస్తుందన్నారు. అలాగే సామాజిక సేవా, సహాయ కార్యక్రమాలు, విద్యా కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. దీనిలోభాగంగానే డిఎస్‌సికి సిద్ధపడుతున్న అభ్యర్థులకు ఈనెల 13వ తేదీ మంగళవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి నగరంలోని సూర్యకళామందిరంలో అవగాహన సదస్సును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సదస్సు లో పోటీ పరీక్షల శిక్షణా నిపుణులు, పూర్వ ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు, ఆయన బృందం హాజరై వివిధ అంశాలను బోధిస్తారని తెలిపారు. అదేవిధంగా సదస్సుకి హాజరైన అభ్యర్థులకు లక్ష్మణరావు సౌజన్యం తో రూపొందించిన విద్యా మనో విజ్ఞాన శాస్త్రం స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందచేస్తామన్నారు. ఈ సందర్భంగా మెటీరియల్ బుక్‌ను వారు ఆవిష్కరించారు. ఇతర వివరాలకు యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు టి.రామలక్ష్మి (9959562666), కె.పెద్దిరాజు(9652677889)లను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కెవివి.నగేష్, నాయకులు కె.ఈశ్వరరావు, కాంట్రాక్టు లెక్చరర్ల సంగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.మాణిక్యం పాల్గొన్నారు.



అనాతవరం లో ట్రాఫిక్ క్లియర్ చేస్తున్న పోలీసులు

ఎదురెదురుగా ఢీకొన్న లారీలు ట్రాఫిక్‌కు అంతరాయం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

మండలంలోని అనాతవరం జాతీయ రహదారి 216పై వై జంక్షన్ వద్ద శుక్రవారం మధ్యాహ్నం ఎదురుగా వస్తున్న రెండు లారీలు ఢీ కొనడంతో గంటల కొద్ది భారీ ట్రాఫిక్ జామ్ తో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. చేపల్లోడుతో వెళ్తున్న లారీ ఎదురుగా వస్తున్న ఐషర్ వ్యాను ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఎవరికి గాయాలు కాలేదు. అయితే ఢీకొన్న లారీలు రోడ్డుకు అడ్డంగా నిలిచిపోవడంతో భారీగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో శుక్రవారం ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్థానిక పోలీసులు ఎస్ఐ డి.జ్వాలా సాగర్ ఆధ్వర్యంలో క్రేన్ లతో లారీలను పక్కకు తొలగించి హుటాహుటిన ట్రాఫిక్ ను క్లియర్ చేశారు.

పుట్టినతేది ధ్రువీకరణ ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా, నేను నిమ్మల నాగేశ్వరరావు, తండ్రి: కృష్ణారావు, తల్లి: మాణిక్యం, ఇంటి నెం. 1-7, ఆరికిరేవుల, కొవ్వూరు మండలం, తూర్పుగోదావరి జిల్లాకు చెందిన దంపతులకు 12-06-1962వ సంవత్సరంలో మొదటి కుమారుడిగా జన్మించినాను. ఈ తేదీ నా యొక్క స్కూల్ స్టడీ సర్టిఫికెట్ ననుసరించి ధ్రువీకరించబడినది. కావున నా జనన తేది ధ్రువీకరణపై ఎవరికైన ఏవిధమైన అభ్యంతరాలు ఉన్న నేటి నుండి 7 రోజుల లోపుగా కొవ్వూరు ఆర్డీవో, కొవ్వూరు మండలం తహాశీల్దార్, ఆరికిరేవుల గ్రామపంచాయతీకి గాని తెలియజేయగలరు.

నిమ్మల నాగేశ్వరరావు
S/o. కృష్ణారావు, ఇంటి నెం. 1-7,
ఆరికిరేవుల, కొవ్వూరు మండలం,
తూ॥గో॥జిల్లా, సెల్: 7569730770

పుట్టినతేది ధ్రువీకరణ ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా, నేను తాడిమళ్ళ వెంకటేశ్వరరావు, తండ్రి: సత్యనారాయణ, తల్లి: సూర్యకాంతం, ఇంటి నెం. 1-65, ఆరికిరేవుల, కొవ్వూరు మండలం, తూర్పుగోదావరి జిల్లాకు చెందిన దంపతులకు 10-07-1967వ సంవత్సరంలో రెండవ కుమారుడిగా జన్మించి వున్నాను. ఈ తేదీ నా యొక్క స్కూల్ స్టడీ సర్టిఫికెట్ ననుసరించి ధ్రువీకరించబడినది. ఎవరికైన ఏవిధమైన అభ్యంతరాలు ఉన్న నేటి నుండి 7 రోజుల లోపుగా కొవ్వూరు ఆర్డీవో, కొవ్వూరు తహాశీల్దార్, ఆరికిరేవుల గ్రామపంచాయతీకి గాని తెలియజేయగలరు.

తాడిమళ్ళ వెంకటేశ్వరరావు
S/o. సత్యనారాయణ, ఇంటి నెం. 1-65,
ఆరికిరేవుల, కొవ్వూరు మండలం,
తూ॥గో॥జిల్లా, సెల్: 9701925058

ఒరిజినల్ దస్తావేజు పోయినది

మా క్లయింట్ తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం పట్టణం, లలితానగర్ వాస్తవ్యులు **లేటు సి.పి.ప్రభాకరరావు గారి కుమారుడు శ్రీ చింతలూరి వెంకటరావు,** వయస్సు 76 సంవత్సరాలు, మాకు ఇచ్చిన సంజాయిషీ ప్రకారం మా క్లయింటు తాలూకు **ఒరిజినల్ దస్తావేజు నెంబరు 1476/1980, Dt. 04-04-1980 SRO,** రాజమండ్రి నెంబరు గల ఒరిజినల్ దస్తావేజు **ది. 4-11-2024వ తేదీన** నా క్లయింటు తన ఇంటినుండి రాజమండ్రి ఎ.వి.అప్పారావు రోడ్డు నందు జంబో జిరాక్స్ నిమిత్తం వెళ్తుండగా ఆయన తాలూకు నీలం సంచిలో ఉన్న దస్తావేజు పడిపోయినది. కావున అవి ఎవరికైనా దొరికినా తిరిగి ఇప్పించగలరు. వారికి తగిన పారితోషికం ఇవ్వగలవారము.

యిన్నమూరి బాలసుబ్రమణ్యం
న్యాయవాది, 31-1-2/1,
జండాపంజా రోడ్డు, రాజమహేంద్రవరం
సెల్: 93979 71818

ప్రకటన

మహారాజశ్రీ కొవ్వూరు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
ఐ.ఎ. 262/2024
ఓ.యస్. 211/2024

Between :
పిటీషనరు / వాది:
కుమారి నార్కిమెల్లి దేజి రత్న దీపిక
...పిటీషనర్ / వాది
మరియు
రెస్పాండెంట్లు / ప్రతివాదులు:
1. శ్రీమతి తవ్వా పద్మావతి, భర్త : కామేశ్వరరావు, నివాసం: డోర్ నెం. 2-115, ఆరికిరేవుల గ్రామం, కొవ్వూరు మండలం, తూ॥గో॥జిల్లా.
2. శ్రీ తవ్వా మణికుమార్, తండ్రి : కామేశ్వరరావు, నివాసం: డోర్ నెం. 2-115, ఆరికిరేవుల గ్రామం, కొవ్వూరు మండలం, తూ॥గో॥జిల్లా.
...రెస్పాండెంట్లు / ప్రతివాదులు

పై నెంబరు దావాలోను మరియు పిటీషన్ నందు ప్రతివాద్లు / రెస్పాండెంట్లు అయిన మీకు ఎన్నిసార్లు శ్రీ కోర్టువారు సమన్లు, నోటీసులు పంపించుచున్నను వాటిని మీరు తీసుకొనకుండా ఉద్దేశ్యపూర్వకంగా తిప్పి పంపించుచున్నందున, శ్రీ కోర్టువారు మీకు సబ్స్టిట్యూట్ సర్వీసు ద్వారా సమన్లు, నోటీసులు అమలుపరచుటకు ఉత్తర్వులు యిచ్చినందున పై కోర్టువారి ఉత్తర్వులు ప్రకారం యీ ప్రకటన ద్వారా మీకు వాయిదా తెలియజేయడమైనది. కావున, **ది. 15-05-2025 వ తేదీ, ఉ. 10-00 లకు** మీ యొక్క హాజరు నిమిత్తం వాయిదా అయివున్నది. ఆరోజున మీరు స్వయంగా గాని, లేదా న్యాయవాది గారి ద్వారా గాని, పై కోర్టు వారి ఎదుట హాజరు అయి, మీ ఆక్షేపణలు తెలియపరచుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

వాయిదా తేది : 15-05-2025

శ్రీ టి. చిట్టిబాబు
స్థలం: కొవ్వూరు, అడ్వకేట్
తేది: 09-05-2025 కొవ్వూరు

సర్టిఫికెట్స్ పడిపోయినవి

మా క్లయింట్ తూర్పుగోదావరి జిల్లా, అనపర్తి మండలం, మహేంద్రవాడ గ్రామం, డోర్ నెం. 9-17రు కాపురస్తులు సత్తి వెంకటరెడ్డి గారి కుమార్తె మరియు మేడపాటి వెంకట రెడ్డి గారి భార్య అయిన సుజాత గారు ఇచ్చిన సంజాయిషీపై జనరల్ పబ్లిక్ యావన్మందికి తెలియజేయునది. మా క్లయింటుకు చెందిన **Board of Intermediat వ Pass Certificate No. 1303239124** ఒరిజినల్ మరియు మండపేట ఆదిత్య జూనియర్ కళాశాల వారు ఇచ్చిన **Transfer Certificate (T.C)** ఒరిజినల్స్ మహేంద్రవాడ నుండి అనపర్తి జిరాక్స్ తీయించుకు వెళ్ళుచుండగా మార్గమధ్యంలో పడిపోయినవి. ఎంత వెతికిననూ లభించలేదు. పై సర్టిఫికెట్లు ఎవరికైనా దొరికినచో మాకు తెలియజేయగలరు.

అనపర్తి, 09-05-2025.

మేడపాటి రవిషణ్ముఖ రెడ్డి,
గొలుగూరి బుల్లి రెడ్డి, అడ్వకేట్స్,
అనపర్తి, తూ॥గో॥జిల్లా.
సెల్: 9849414626, 9348049999

In the Court of the Ist Addl. District Judge (MACT), E.G.Dist., Rajahmundry
M.V.O.P. No. 66/2023

Between:
1. అంగర సత్తిబాబు –పిటిషనరు
మరియు
1. ఎ.కిరణ్‌కుమార్ మరియు ఇతరులు
–రెస్పాండెంట్లు

రెస్పాండెంటు – R-1:
ఎ.కిరణ్‌కుమార్, S/o. పెద్దిరాజు, C/o. శ్రీనివాసరావు, హిందువు, వయస్సు 28 సం॥లు, Driver of TATA Ace Auto (Four Wheeler) Regd. Bearing No: AP 05 W 9525, R/o. D.No. 82-12-43, బర్మ కాలనీ, లాలాచెరువు, రాజమండ్రి, తూ॥గో॥జిల్లా.

పై నెంబరు ఓ.పి.లో శ్రీ కోర్టు వారు మీకు ఎన్నిసార్లు సమన్లు పంపినను ఉద్దేశ్యపూర్వకంగా తీసుకొనక తప్పుదారి పట్టిస్తూ కాలయాపన చేయుచున్నారు. కాబట్టి సదరు రెస్పాండెంటు వాయిదా రోజు అనగా **ది. 19-05-2025వ తేదీన ఉదయం 10.30 గం॥లకు** కోర్టుకు హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును.

జి.శ్రీనివాస్
రాజమండ్రి పిటిషనర్ తరపు న్యాయవాది
08-5-2025 రాజమండ్రి